క్లుప్తంగా

ఘనంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో వెలసిన శ్రీసీతారాముల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు జరిపారు. భక్తులు కాయకర్పూరాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పెద్దముడియం : మేడిదిన్నె పీహెచ్‌సీ పరిధిలోని పెద్దపసుపుల, నెమళ్లదిన్నె, చిన్నముడియం గ్రామాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు వైద్యాధికారి నేగళ్ల హుస్సేన్ తెలిపారు. గ్రామాలలో ఇంటింటి సర్వే నిర్వహించి వాంతులు, విరేచనాలు, జ్వరాలు ఎవరికైనా ఉన్నాయా అని సర్వే చేశామన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాల్సిందిగా ప్రజలకు సూచించామన్నారు. ఆరోగ్య అధికారి సుబ్బరాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ


ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న డీపీఎం వసంత కుమారి

పులివెందుల రూరల్ : పులివెందుల మండలంలోని ఎస్సీ రైతులకు సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ క్రాంతిపథకం అడిషనల్ డీపీఎం వసంతకుమారి నవధాన్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది భాస్కర్, శ్రీను, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులకు రూ.10లక్షలు బీమా


గృహసారథుల బీమా నమోదు చేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గృహసారథులకు ప్రకటించిన రూ.10లక్షల బీమాకు సంబంధించిన వివరాలను సోమవారం స్థానిక చిన్నరంగాపురం సచివాలయంలో నమోదు చేసినట్లు కన్వీనర్ రామమూర్తిరెడ్డి తెలిపారు. జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున రెడ్డి, కొండయ్య, సంపత్ పాల్గొన్నారు.

పేదల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ కోరారు. పెండ్లిమర్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెద్ద దారిపల్లె రెవెన్యూ పొలం సర్వే నంబర్ 330లో నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు రాష్ట్ర ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

చెన్నూరు: చెన్నూరులోని గోసుల కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జరగనున్న ఆత్మీయ కృతజ్ఞత సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామమూర్తి, పెడబల్లె ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు సంపూర్ణ ఆహారం తీసుకోవాలి

వేముల : గర్భిణులు సంపూర్ణ ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వేంపల్లె ప్రాజెక్టు సీడీపీఓ సునీత తెలిపారు. మండలంలోని ఇ.కొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం (పోషణ మాసం) కార్యక్రమాన్ని ఆమె గర్భిణులకు, బాలింతలకు నిర్వహించి మాట్లాడారు.

ఎర్రగుంట్లకు సరికొత్త శోభ


రోగులకు వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న పబ్లిక్ హెల్త్ కేంద్రం


నూతన హంగులతో ముస్తాబైన మున్సిపల్ భవనం

- రూ.3 కోట్ల వ్యయంతో ప్రభుత్వ భవనాలు, బ్రిడ్జి నిర్మాణం
- దివంగత సీఎం వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు
- ఈ నెల 8వ తేదీన ప్రారంభోత్సవం
- హాజరుకానున్న ప్రముఖులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రం, సుందరయ్య కాలనీలోని బ్రిడ్జి, పశు వైద్యశాల నూతన భవనంతో పాటు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డిలు రానున్నారు. ఈ భవనాల నిర్మాణంతో యర్రగుంట్ల పట్టణ రూపురేఖలు మారిపోనున్నాయి. దీనికి తోడు జాతీయ రహదారి మధ్యలో చెట్లు నాటే కార్యక్రమం కూడా చేపట్టనున్నారు.

సుమారు రూ.3 కోట్లతో భవనాల నిర్మాణం

ఎర్రగుంట్ల పట్టణంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నూతన భవనాలు నిర్మించారు. ఇందులో రూ.2 కోట్లతో మున్సిపల్ భవనం, రూ.80 లక్షలతో పబ్లిక్ హెల్త్ కేంద్రం, రూ.33 లక్షలతో సుందరయ్య కాలనీలో బ్రిడ్జిలు నిర్మించారు. రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు, రూ.7 లక్షలతో పచ్చదనం కల్పించనున్నారు. ఈ భవనాల మధ్యలోనే దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ దాత ఎర్రగుంట్ల వాసి, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్ రెడ్డి కావడం విశేషం. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, కో–ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డిలు నిత్యం పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు అందిస్తున్నారు.


ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం

ప్రారంభోత్సవానికి భారీగా తరలిరావాలి..

ఈ నెల 8వ తేదీన నూతన భవనాల ప్రారంభోత్సవానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తరలి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

వైభవంగా జంబులింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ట

జమ్మలమడుగు : పట్టణంలోని పెన్నానది ఒడ్డున వెలసిన జంబులింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆలయ నిర్మాణం కోసం 40 లక్షల రూపాయలు మంజూరు చేసింది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా పూజలను నిర్వహించి జంబులింగేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటు ఆలయంలో శిలా ఫలకాన్ని ప్రారంభించారు. అలాగే టీడీపీ నాయకుడు సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


ఆలయ జీర్ణోద్ధరణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగాల ఎంపీపీగా అలవలపాటి రమాదేవి ఏకగ్రీవం

లింగాల : లింగాల ఎంపీపీగా వెలిదండ్ల ఎంపీటీసీ అలవలపాటి రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో లింగాల ఎంపీపీగా పనిచేసిన ఎం.అమృత అనివార్య కారణాల వల్ల పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎంపీపీ పదవికి నోటిఫికేషన్ వెలువడడంతో సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలోని 9 మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెలిదండ్ల ఎంపీటీసీ ఎ.రమాదేవి పేరును ఎంపీపీ అభ్యర్థిగా ఇప్పట్ల ఎంపీటీసీ ఎం.అమృత ప్రతిపాదించారు. అందుకు బోనాల, లింగాల ఎంపీటీసీలు కళ్యాణి, జ్యోతి బలపరిచారు. దీంతో ఎంపీటీసీలు చేతులెత్తి రమాదేవిని ఏకగ్రీవ ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిల ఆశీస్సులతో ఈ పదవి వచ్చిందన్నారు. మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె తన భర్త అయిన మల్లికార్జున రెడ్డితో కలిసి ఎంపీటీసీలను సత్కరించారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్ రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్‌లు రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ పుష్ప, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్ రెడ్డి, తాతిరెడ్డి పల్లె సర్పంచ్ మల్లికేశ్వర రెడ్డి, కర్ణపాపాయపల్లె నాగేశుల రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఎంపీటీసీలతో ఎంపీపీ రమాదేవి

రోడ్ల విస్తరణ పనులకు సహకరించాలి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులకు వాణిజ్య, గృహ యజమానులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ ఈఈ వారి సిబ్బందితో కలసి క్షేత్రస్థాయిలో రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల విస్తరణకు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం వాణిజ్య, గృహ యజమానులు త్వరితగతిన తొలగించుకోవాలన్నారు. లేని పక్షంలో జేసీబీ సాయంతో తొలగిస్తామన్నారు. అందుకు సంబంధించిన ఖర్చుకూడా వారే భరించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టీపీఓ, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్ల విస్తరణను పరిశీలిస్తున్న అధికారులు

క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

జమ్మలమడుగు : ఈనెల 8వతేదీన జరిగే ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని పీఈటీ, పీడీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ అండర్–17, అండర్–14 విభాగంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లాపరిషత్, కస్తూర్బా గాంధీ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు ఈనెల 6వతేదీ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కన్వీనర్ మురళి, మండలంలోని పీఈటీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరమణారెడ్డి

హామీల అమలులో బీజేపీ విఫలం

జమ్మలమడుగు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం నాయకుడు శివనారాయణ విమర్శించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దనోట్లను రద్దుచేసిన ప్రభుత్వం కనీసం ఒక్క రూపాయి కూడా నల్లధనాన్ని స్విస్‌బ్యాంక్ నుంచి తీసుకురాలేదన్నారు. మోడీ ప్రభుత్వ తొమ్మిది సంవత్సరాల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలతోపాటు గ్యాస్ సిలిండర్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుకుంటూ పేద ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. కేవలం కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే తప్ప నిరుపేదల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, వినయ్‌కుమార్, ప్రసాద్, దాసు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

లోతట్టు గ్రామాలు జలమయం

కొండాపురం : మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చిన్నపల్లె, కె.సుగుమంచిపల్లె గ్రామాలు జలమయమయ్యాయి. గండికోట జలాశయం కింద కె.సుగుమంచిపల్లె గ్రామం సగ భాగం ముంపునకు గురైంది. మిగతా సగం గ్రామంలో ఓ మోస్తరు వర్షం కురిసినా వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి గ్రామాన్ని ముంపు కింద పరిగణించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షపు నీటిలో విషపురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చిన్నపల్లె గ్రామ సమీపంలో గండికోట ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన తిమ్మాపురం చెరువు నిర్మించారు. దీంతో చిన్నపల్లె గ్రామంలో నీరు బయటకు వెళ్లకుండా ఆగిపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు త్వరితగతిన చొరవ చూపి సమస్య పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


చిన్నపల్లె గ్రామాన్ని చుట్టు ముట్టిన వర్షపునీరు

లబ్ధిదారులకు పింఛన్ అందజేత

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల కేంద్రం సచివాలయం–1లో సోమవారం మార్కెట్‌యార్డు చైర్మన్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాద్రిపురం గ్రామ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద సెప్టెంబర్ 2023లో 54 మంది కొత్త పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ మంజూరైందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారుల వయస్సు 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ ముల్లా జాఫర్, పంచాయతీ కార్యదర్శి హరికిశోర్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్ రెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ


మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి


హాజరైన మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కమలాపురం నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మీడియా మిత్రులకు సోమవారం మండలంలోని మూలవంక సమీపంలో గల రాజా రాణి మహల్‌లో ఎమ్మెల్యే కృతజ్ఞత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కమలాపురం నియోజక వర్గంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆదర్శంగా తీసుకొని వాటిని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పులి సునీల్ కుమార్, ఏపీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ పాకా సురేష్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో–కన్వీనర్ కళాయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని జెండామాను వీధిలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేయాలి

కమలాపురం : ఈ–క్రాప్ బుకింగ్‌తో ఈకేవైసీ కూడా చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం పొడదుర్తి గ్రామ పొలాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ–క్రాప్ బుకింగ్ 95 శాతం పూర్తి అయిందన్నారు. అయితే ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంట సాగు చేసిన రైతులు ఇప్పటికీ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోకుంటే తక్షణం సంబంధిత ఆర్‌బీకేలకు వెళ్లి వ్యవసాయ సిబ్బందిని కలసి ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ సిబ్బంది కూడా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోని రైతులకు సమాచారం అందించి ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయాలన్నారు. ఇవి పూర్తి అయితేనే ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, ఎంపీఈఓ వికాస్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డి



కమలాపురం : కమలాపురం సీఐగా బి.రామక్రిష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా గుత్తి ఎస్ఐగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై కమలాపురం సీఐగా బదిలీపై వచ్చారు. సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

క్రీడా పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాళెం : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆటలపై ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ తెలిపారు. రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన మహిళలు, పురుషులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఆయా సచివాలయాల్లో అందజేస్తే వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ ఈ ఐదు ఆటలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్కరు రెండు ఆటల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వారంతా ఆ సచివాలయంలోనే పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

జమ్మలమడుగు : ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ మంగళవారం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరవుతున్నట్లు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పామిలేటి, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలం అనే అంశంపై ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ఉమేష్ చంద్రపై కాల్పులు జరిగిన సమయంలో ఆయన గన్‌మెన్‌గా ఉన్న అరవ రామచంద్రారెడ్డి కూడా ప్రాణాలు అర్పించారు. సోమవారం అరవ రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి సుభద్ర, కుమారుడు, కుమార్తెల ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, ఆయన సతీమణి సోమేశ్వరమ్మ, శ్రీరంగనాథస్వామి దేవస్థాన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

వీరపునాయునిపల్లె : జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఆధునిక వ్యవసాయంపై గత ఆరు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంట సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవల్లి,డాక్టర్ సాయి మహేశ్వరి,డాక్టర్ ప్రశాంతి, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.